

# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

ఇప్పటి వరకూ జరిగిన కథ

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

3 నెలల తరవాత.

"మధురా.. కాలానికి కామా ఫుల్ స్టాపులు రెండూ ఉండవు. అది నిరంతర ప్రవాహం. మంచి, చెడు, కష్టం, సుఖం ఇటువంటి ద్వంద్వాలు నడుస్తూనే ఉంటాయి. ఏదీ శాశ్వతం కాదు. శాశ్వతం అనుకోవడం భ్రమ. జరిగిన విషయాలన్నీ నీకు చెప్పాను కదా! ఒకడు పుట్టుక తన వాడనంతా నాశనం చేస్తే, మరొకడు నవ్వుతూ ఎనిమిది పళ్ళతో పుట్టాడు. తక్షపురంలో ఉండే నాగ శిల్పం తక్షకుడే అని ఒక ముసల్ది నిర్ధారిస్తే, ఇనుము ముక్కుల గద్దలు కొన్ని తాంత్రిక శక్తుల సృష్టి, అని మరొకరు నిర్ధారించారు" ఆగాడు రామజోగి. శ్రద్ధగా వింటోంది మధుర.

"మహాకన్యాదేవినీ ఆవిడ సహచరుల్నీ నేను కలిశాను. శిధిలాలయానికీ వెళ్ళాడు. అరిదమన, అలాబసులనీ, సకల్పానందనీ కూడా కలిశాను. మహా భారత యుద్ధంలో మాయమైన ఆయుధాల గురించీ విన్నాను. ఓ పక్క ముసల్మానులు, ఓ పక్క క్రైస్తవులు, ఓ పక్క మూఢాచార ఛాందసులు, మరోపక్క ఉగ్రవాదులు, వేర్పాటువాదులు, శిరస్సులోతు స్వార్ధంలో కూరుకుపోయిన రాజకీయ నాయకులు, లంచాలు మరిగి ఎవరికీ భయపడని అధికారులు,

'ఉచితాల' కోసం యాచకుల్లాగా మూగిపోతే ప్రజలు, నా దేవుడు గొప్ప అంటే నా దేవుడు గొప్ప అని శిగపట్లకి దిగే భక్త శిఖామణులు, అంగుళం కూడా ఖాళీ లేకుండా ప్రపంచమంతా ఆక్రమించిన కాలుష్యం.. ఇదేగా యీ కలియుగ ధర్మాలు?

దేవుడ్ని, దర్శించడానికి టిక్కెట్టా? మందే లేని జబ్బుకి లక్షల్లో హాస్పిటల్ ఛార్జీలూ, కుంచించుకుని భూస్థాపితం కావడానికి సిద్ధంగా వున్న వేలాది 'భాష 'లూ.. న్యాయం అంటే ఏమిటీ? అనేలా నిర్వచనాలు మార్చుకున్న చట్టాలూ... ఏది సబబో, ఏది అసబబో తెలియని పరిస్థితిలో ఉన్నాము. అన్నీ అందరికీ తెలుసు. కానీ ఏదీ ఆపరు. ఇవ్వాళ జీవులకి జీవితం తప్ప అన్నీ ముఖ్యమే" మళ్ళీ ఆగాడు రామజోగి.

"ఇది యుగధర్మమేగా...!" సన్నగా నిట్టూర్చి అన్నది మధుర "అవును. యుగ ధర్మమే. కానీ మధురా ఓ విశేషం ఉంది. కృతా, త్రేతా, ద్వాపర, కలి యుగాలు నాలుగు. ఆ నాలుగునీ కలిపితే ఒక 'మహాయాగం' అవుతుంది. ప్రతి యుగం ఒకేలాగా జరిగినా ఆ మహా యాగంలోని 'కలి' మాత్రం మారుతుంది. అస్త్రశస్త్రాలు మారతై. ఆహార్యం మారుతుంది. ఏదీ ఊహకి అందని విధంగానే జరుగుతూ వుంటుంది. ఈ 'కలి' విశేషం ఏమంటే 'కలి' యొక్క సహజ లక్షణాలతో బాటు ద్వాపర యుగ 'శేష' కర్మలు యీసారి కలవడం. దాంతో కలియుగ ప్రతాపం అత్యంత ఘోరంగా ఉంటుంది. కలిలో ఉన్న దుష్ట శక్తులతో ద్వాపర యుగంలో మిగిలిన దుష్టశక్తులు తోడవుతాయి. అందువల్ల ఫలితం అనూహ్యంగా ఉంటుంది" అన్నాడు రామజోగి.

మధుర మొహంలో విషాదం "తప్పే మార్గం పడలేదా?" అడిగింది.

"ఇటువైపు రావలసిన తుఫాను చివరిక్షణంలో దారి మార్చుకుంది. దానికి కారణం నలువైపుల నించి ఒకేసారి యీ దేశాన్ని చుట్టబెట్టడం... మన సంస్కృతీ సంప్రదాయాలని మట్టుపెట్టడం. ఇప్పుడు ఎటువైపు పోతుందో కూడా తెలియని అనిశ్చితస్థితి. విలియమ్స్ అనేవాడి ఆత్మ కొన్ని సూచనలు మొదట్లో ఇచ్చింది. ఆ తరవాత ఆ సూచనలు ఆగిపోతూ రాబీ అనే అమెరికన్ మహాభారత ఆయుధాలని గురించి కలవరించాడు. మళ్ళీ తన దారిన తాను అమెరికా వెళ్ళిపోతూ అమెరికానించి ఇండియా వచ్చిన స్టీట్సన్, డాంటే, గోర్కీ రాజోవ్‌లకి ఏమయిందో తెలీదు. 'సిటి అబ్జర్వర్' పత్రికా యాజమాన్యం యజ్ఞప్ప మౌన మునిలా ఉన్నారు. పరమేశ్వర శాస్త్రిగారు సంకల్పానంద, మట్టూ, నీలుడు కలిసి అమ్మవారి పూజల్ని నిర్విఘ్నంగా జరిపిస్తున్నారు. ఇక శృంగి సంగతి నీకు తెలుసుగా..., పరమేశ్వర శాస్త్రిగారి మాటని కూడా పక్కన పెట్టి తక్షకపురం పోయాడు. అక్కడ ఏం చేస్తున్నాడో తెలీదు. నీకు చెబితే ఆకాశం నిండా అతి భయంకరంగా మబ్బులు కమ్ముకుని క్షణాల్లో మళ్ళీ ఆకాశం యధాతధంగా ప్రత్యక్షమైన భావన నాలో కలుగుతోంది" ఎటో చూస్తూ అన్నాడు రామజోగి.

వాతావరణం నిర్మలంగా ఉంది. కాకులు అరుపులు, పిచ్చుకల శబ్దాలు వినిపిస్తున్నాయి. ఆకాశం నిర్మలంగా ఉంది. అప్పుడప్పుడూ చిరుగాలి తరగలు.

"మూడున్నర నెలల తరవాత వచ్చారు.. మొదట విశ్రాంతి తీసుకోండి. అరగంటలో వంటచేసి లేపుతాను" కూర్చున్న చోటినించి లేచి అన్నది మధుర.

"భోజనానికి తొందరలేదు. అసలు ఆకలేలేదు. ఆలోచనలు మాత్రం నన్ను చాలా ఇబ్బంది పెడుతున్నాయి. ఓ విధంగా తుఫాను ముందర ఉండే నిశ్శబ్ద సముద్రంలా ఉంది మనసు. ఏదో చెయ్యాలి...కానీ ఏం చెయ్యాలో తెలియదు. ఏదో తెలుసు కోవాలి.... కానీ తెలుసుకోవాల్సింది ఏదో కూడా తెలీదు" అన్నాడు రామజోగి నిట్టూర్చి.

కర్తవ్యం అని మనం అనుకుంటాం. కాని మనం కాదు. చేయించేవాడు కనపడటం. చేసేవాడు మాత్రం కనపడతాడు. ఎన్నెన్నో విచిత్రాలు జరిగాయి. కారణం ఎవరూ? మనం ఫలానా ఫలానా వాళ్ళని ఊహిస్తాం. ఒక్కోసారి ఆశావాహమే అవుతుంది. ఒక్కోసారి ఆ ఊహే  మనం ఎంత మూర్ఖులమో చెబుతుంది. లే.. యీ లోకానికి ఒక సాక్షిగా, అతిథిగా వచ్చాం. అలాగే ఉందాం. సాక్షిగా ఉన్నప్పుడు మాత్రమే మనం జరుగుతున్న వ్యవహారాల్ని నిశితంగా గ్రహించగలం. మనమూ ఆ వ్యవహారాల్లో భాగం అయితే నిజాన్ని ఎప్పటికీ గ్రహించలేము" అన్నది మధుర.

చిన్నగా తల పంకించి లేచారు రామజోగి.

చల్లని చెరువు. దాదాపు వంద ఎకరాలు విస్తీర్ణం ఉంటుంది. చెరువు నిండా ఓ పక్క కలువలు మరో పక్క తామరపూలూ, అక్కడక్కడా జమ్ము పొదలూ, కొంగలూ బాతులతో ఆహ్లాదకరంగాఉంది. గట్టు చుట్టూ రావి, మర్రి, తాడి, ఈత, మోదుగ చెట్లు. కొన్ని కొబ్బరి చెట్లు కూడా ఉన్నాయి. మరణించిన వారి గుర్తుగా చెరువు గట్టున పాతిన కొబ్బరి చెట్లు అవి. ఒకటి రెండు వెలగచెట్లు ఉన్నాయి.

ఆ చెట్ల క్రింద, ముఖ్యంగా రావి, మర్రి చెట్ల కింద చాలా చాలా నాగప్రతిష్టలు జరిగినందుకు ఫలితంగా వందలకొద్దీ నాగశిలలు ఉన్నాయి. కొన్ని పసుపూ కుంకుమలతో ఫ్రెష్‌గా ఉంటే, కొన్ని పాతబడి పోయి ఉన్నాయి. 'కళ' మాత్రం తగ్గలేదు.

"అతని పేరు నాగయ్య.. చెరువులో స్నానం చేసి చెంబుతో అన్ని నాగశిలల మీద నీళ్ళు కుమ్మరిస్తాడు" రుద్రమూర్తి శ్రీనివాస్‌తో అన్నాడు.

శ్రీనివాస్ కొంచెం దూరంగా ఉన్న నాగయ్యని కళ్ళు చికిలించుకుని చూశాడు. నాగయ్య వయసు కనీసం అరవై దాటి ఉంటాయనిపించింది.

"నాగదేవతలంటే ఇష్టమా?" అడిగాడు శ్రీనివాస్. శరద్వతి కుతూహలంగా వింటోంది. ఆమెకు చాలావరకూ తెలుగు అర్థం అవుతోంది. చక్కగా కొంచెం హిందీ యాసతో మాట్లాడుతోంది కూడా.

"తెలీదు. నా వయసిప్పుడు ఇరవై ఎనిమిదేళ్ళు. చిన్నప్పటినుంచీ చూస్తూనే ఉన్నా. ఎవరితోటి పెద్ద మాట్లాడడు. కాపలాదారులాంటివాడు. చెరువుని ఎవరు చెడగొట్టాలని వచ్చినా ఆ క్షణంలో నాగయ్య నిజంగా రుద్రుడై పోతాడు. ఉత్తరం మూల చెరువుకి అరవై గజాల దూరంలో స్మశానవాటిక ఉంది. అక్కడ కర్మలు జరిగినప్పుడు కూడా చెరువులో నీళ్ళు కావిడి బిందెలలాగా ఇచ్చి స్నానం చెయ్యమంటాడేగానీ, ఎవర్నీ చెరువులో దిగనివ్వడు" అన్నాడు రుద్రమూర్తి.

"అదేమిటీ?" ఆశ్చర్యంగా అన్నాడు శ్రీనివాస్.

"తెలీదు. ఊరివాళ్ళు కూడా నాగయ్యని అతిక్రమించి స్నానానికి చెరువులో దిగరు. కొందరు అహంభావులు నాగయ్యని ఊరునించి వెళ్ళగొట్టడానికి ట్రై చేశారుగాని ఎవ్వరికీ సాధ్యం కాలేదు. ఊరు సపోర్టు నాగయ్యకుంది" అన్నాడు రుద్రమూర్తి.

"భార్యాపిల్లలు లేరా?" అడిగాడు శ్రీనివాస్.

"తూర్పువైపు గుడిసెలాంటి దాన్లో ఉంటాడు. ఊళ్ళోకి కూడా పెద్దగా రాడు" అన్నాడు రుద్రమూర్తి.

"నాకెందుకో అతనితో మాట్లాడలని ఉంది" అన్నది శరద్వతి.

"నాగ శిలల పనిపూర్తయ్యేదాకా రాడు" అన్నాడు రుద్రమూర్తి.

"చేసే పనేమీ లేదుగా. హాయిగా చెరువు దగ్గర చల్లగా గాలిలో కూర్చుందాం. అతనూ మనవైపు చూసినప్పుడు 'రావొచ్చు' అని సౌంజ్ఞ చేద్దాం. రమ్మంటే అతని దగ్గరకి వెళ్దాం" అన్నది శరద్వతి.

"నీకెందుకులాగ అనిపించిందో నాకు తెలీదుగానీ, నువ్వలా అడటం మాత్రం నాకు ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు శ్రీనివాస్ చిన్నగా నవ్వి.

"నిజం చెబితే నాకూ తెలీదు" నాగయ్య ఉన్న అవతలి గట్టువైపే చూస్తూ అన్నది శరద్వతి.

కొంగల బారు ఒకటి వచ్చి చెరువు మీద వాలింది. కొంగల కాళ్ళు నీళ్ళల్లో దిగటం ఎంత సున్నితంగా నిశబ్దంగా ఉంటుందో.

"చెరువునిండా చేపలు. ఇతర ఊళ్ళల్లో అయితే చేపల పాటలు" జరుగుతై. తద్వారా ఊరి పంచాయితీలకి బాగానే రెవెన్యూ, అంటే, ఆదాయం వచ్చింది. ఈ చుట్టు పక్కల ఊళ్ళన్నీ ఆ పద్ధతినే అనుసరిస్తున్నా, యీ ఊళ్ళో మాత్రం చేపలపాట ఉండదు. అందుకే చెరువు నిండా సమృద్ధిగా చేపలుంటాయి. కొంగలు, రకరకాలు పక్షులు యీ చెరువుకి చేరేది చేపల కోసమే" నవ్వి అన్నాడు రుద్రమూర్తి.

"మంచి ఉదాహరణ. నిజంగా యీ లోకంలో మనమంతా కూడా వలస పక్షులమే! ఆఖరికి చెరువులూ కొండలూ కోనలతో సహా. చెరువులు ఆక్రమణలకి గురై జనావాసాలు అయితే, కొంగలు కంకర రాళ్ళుగా మారి రోడ్లుగా రూపాంతరం చెందుతాయి. అంటే 'అచల' మైన కొండలు మృత్యువు పాలవక తప్పదు. ప్రతి క్షణం కోటాను కోట్ల జీవులంతా లోకానికి వస్తున్నాయి. కోటాను కోట్ల కొలది జీవులు వెళ్ళిపోతున్నాయి. 'రాక పోక' ఎక్కడినించి ఎక్కడికో తెలిసినదెవరికీ?" నిట్టూర్చి అన్నాడు శ్రీనివాస్.

"అవును అన్నీ శాశ్వతం అనిపించే అశాశ్వతాలే.! రుద్రా భయ్యా మీరెవరో నేనెవరో.. కానీ మా స్నేహితుడు నా భర్త అయిన శ్రీనివాసు వల్ల ఇక్కడ ఇవాళ కలిశాం. అసలు ఇలా యీ పల్లెని చూస్తానని కలలో కూడా అనుకోలేదు. ఊహించనిది జరగడమే గదా జీవితం అంటే!" రుద్రమూర్తిని చూస్తూ అన్నది శరద్వతి.

ముందు రోజు రాత్రే శ్రీనివాసూ శరద్వతి ఆ పల్లెకి వచ్చింది. ఆ పల్లెకి మూడు మైళ్ళ దూరంలో ఆంజనేయస్వామి గుడి ఒకటి అంది. అది అత్యంత పురాతన మైన గుడి. పంచముఖ ఆంజనేయునిలాగా యీ హనుమంతుడికి అష్ట ముఖాలు. అంటే, ఎనిమిది ముఖాలు. పదహారు చేతులు. దాదాపు 8 అడుగుల ఎత్తున్న మహా విగ్రహం. తెల్లని తెల్ల వారు ఝూముకి ఆ గుడికివెళ్ళి వచ్చారు ముగ్గురూ. గుడికీ ఊరికీ మధ్య ఉన్నది చెరువు గట్టుమీద కొన్ని బెంచీలు కూడా ఉన్నాయి. చెట్ల నీడలు అయితే అత్యంత ఆహ్లాదకరంగా ఉన్నాయి.

"చెల్లమ్మా.. శ్రీనికి చాలా ఉత్తరాలు రాశాను. వాడి పెళ్ళికి నేను 'గుడిమల్లం' రావాల్సింది. కానీ రాలేకపోయాను. ఈ గుడి దగ్గర స్వామి అశీస్సులు మీరు తీసుకోవాలని నా ఆకాంక్ష మాత్రమే కాదు. ఒక ఉన్మత్తత. ఎన్నో రోజులనించీ యీ ఆలోచన నా మనసుని తొలిచి తొలిచి యీనాడు సాకారమైంది" అన్నాడు రుద్రమూర్తి.

"అవునురా రుద్రా.. ఎందుకో నాకూ తక్కున బయలుదేరి రావాలనిపించింది. వెంటనే వచ్చేశాం" అన్నాడు శ్రీనివాస్ రుద్రమూర్తి భుజాన్ని ప్రేమగా తట్టి.

"ఇప్పుడు కలవాల్సిన విధంగా రాసిపెట్టి ఉంటుంది" అన్నది  శరద్వతి దూరం నుంచి ఇటువైపు వస్తున్న నాగయ్యని చూసి. ఆ విషయం గమనించిన రుద్రమూర్తి 'నాగయ్య మామా' ఇటూ అని అరిచాడు. నాగయ్య వీళ్ళ వైపు చూసి తల పంకించాడు.

"శ్రీనీ... ఇతను పెద్దగా మాట్లాడాడు. ఇబ్బంది కలిగించే ప్రశ్నలు వెయ్యకు. వెంటనే లేచి వెళ్ళిపోతాడు" అన్నాడు రుద్రమూర్తి శ్రీనివాసుతో. 'అలాగే' ఉన్నట్టు తలూపాడు శ్రీను. బాగా దగ్గరకి వచ్చాడు నాగయ్య. అతని మొహం గంభీరంగా ఉంది. ప్రశాంతంగా ఉంది. నుదుటి మీద గంధం, గంధం మధ్యలో ఎర్రని బొట్టు.

అప్రయత్నంగా లేచి నాగయ్య పాదాలకు ప్రణమిల్లింది శరద్వతి.

"నూరేళ్ళు చల్లగా వర్ధిల్లండి తల్లీ. మీకు పుట్టబోయే బిడ్డ సామాన్యుడు కాడు" సన్నగా అన్నాడు నాగయ్య.

"మీరెలా చెప్పగలరూ?" అన్నాడు శ్రీనివాసు.

"భరతుడి పుట్టుక తెలుసుగదా? ఓ భరతుడు పుట్టాలంటే ముందు విశ్వామిత్రుడు పుట్టి సన్యసించి, రాజర్షినించి బ్రహ్మర్షి పట్టానికై అంతులేని తపస్సు చెయ్యాలి. ఆ తపస్సుకి భయపడ్డ ఇంద్రుడు మేనకని భూలోకానికి పంపి విశ్వామిత్రుడి తపస్సుని భంగం చెయ్యాలి. తద్వారా వారికి, అంటే ఓ మానవ తాపసికి ఓ అప్సరసకీ ఓ ఆడపిల్ల పుట్టాలి. ఆ పిల్లని పక్షులూ, కణ్వుడు పెంచాలి. పెరిగిన ఆ ఆడబిడ్డని దుష్యంతుడు అనే ఓ దుష్టుడు ప్రేమ పేరు మీద లొంగదీసుకుని గర్భవతిని చెయ్యాలి. కాపురానికి ఆ అమాయకురాలు వెడితే "నువ్వెవరో నాకు తెలీదు" అని పచ్చి అబద్ధం ఆడి ఆమెను నిరాకరించాలి. ఆ పిచ్చిపిల్ల పుట్టిల్లూ, మెట్టినిల్లూ వదిలి వనాల్లో రోజులు వెళ్ళదీస్తూ బిడ్డని కని వాడికి ప్రచండమైన ధైర్యం నూరిపోసి, వాడికి 'సర్వదమనుడు' అని పేరు పెట్టి, ఆ పేరు సార్ధకమయ్యేలా ఆ పిల్లవాడ్ని పెంచాలి. ఆ పిల్లవాడే తరవాత 'భరతుడై' ఈ దేశానికే భరతదేశమనే పేరు తేవాలి. నాయనా, ఓ బిడ్డ పుట్టుకకి వెనుక ఎంత కథ ఉంటుందో, ఎన్ని జన్మల సంబంధం ఉంటుందో అర్ధమయిందా? బిడ్డను అంటే శకుంతలని కన్న తల్లీ తండ్రీ బిడ్డని విడిచి ఎందుకు వెళ్ళిపోయారూ? ఆ బిడ్డని కణ్వుడు ఎందుకు పెంచాడు? ఇలా ప్రశ్నలు వేసుకుపోతుంటే, ఆ ప్రశ్నలకి సరైన జవాబు దొరకదు. కారణం ఏమంటే ఆ కార్యక్రమం కూడా మానవ నిర్మితమో, నిర్ణయమో కాదు" శ్రీను కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు నాగయ్య.

"మీరు చెప్పింది నూటికి నూరుపాళ్ళూ నిజం. మీ ఆశీర్వచనం తప్పక ఫలిస్తుంది" మళ్ళీ రెండు చేతులూ జోడించి అన్నది శరద్వతి.

"మీకు నాగదేవతలంటే ఇష్టమా? తక్షపురం అనే ఓ గ్రామలో తక్షేశ్వరాలయం అనేది ఉన్నది" చెప్పడం మొదలుపెట్టాడు శ్రీనివాస్.

బాబూ.. కొన్ని విషయాలు కాలానికి మాత్రమే సంబంధించినవి. తక్షపురమూ, తక్షకుని శిలావిగ్రహమూ నాకు తెలుసు. అక్కడ జరుగుతున్న విశేషాలు కూడా నాకు తెలుసు. ఎలా అని అడగకు. కాలాన్ని 'నాగు' సూచిస్తుంది. నాగులది ఈశ్వర తత్వం. అనుగ్రహమూ, ఆగ్రహము రెండు ఉన్న జాతి నాగజాతి. కాలమూ అంతేకదా! నాది తక్షపురానికి కూతవేటు దూరాన వుండే పల్లెటూరు. నీ చిన్నతనం అక్కడే గడిచింది. అప్పుడప్పుడూ మామూలు వాళ్ళు ఇటువైపు వచ్చినప్పుడు నాతో ఆ ఊరి ముచ్చట్లు చెబుతారు. ఆ ఊరికి ఓ వృద్ధురాలు వచ్చినప్పుడల్లా ప్రకృతి భీభత్సాలుజరిగాయి. ఈ మధ్యే అలాంటిది జరిగిందని విన్నాను" నేలమీద కూర్చుని అన్నాడు నాగయ్య.

"నిజంగా అది తక్షకుడిదేనా?" కొంత ఆశ్చర్యంతో అడిగాడు శ్రీనివాసు. చాలాసేపు మౌనంగా శ్రీను, శరద్వతి, రుద్రమూర్తులవైపు చూశాడు నాగయ్య. అతని చూపులు సుటిగా సూదుల్లా ఉన్నాయి.

"నేను నాగ ఉపాసకుడిని. నా వంశమే నా గోపాసక వంశం. తక్షపురంలోని తక్షేశ్వర ఆలయం ఒక 'కాల నియమానికి' గుర్తు లేదా చిహ్నం. నాయనా చేటు కాలం దాపురించినప్పుడు మనుషులు మతిభ్రమించిన వారిలా మారతారు. ప్రకృతి వైపరీత్యాల గురించి ముందుగా మనిషిని హెచ్చరించేవి నాగులే. అవి మాత్రమే కాక ఎలుకలు, కాకులు, కుందేళ్ళు, బొరియల్లో దాగి ఉండే జీవులూ అన్నీ హెచ్చరిస్తాయి. వాటి వాటి ప్రవర్తనతో.

వాటన్నిటినీ మనిషి నాశనం చేసేశాడు చాలా వరకూ. గద్దలూ, రాబందులూ కూడా సంవత్సరాల తరబడి మనిషికి కనబడని రోజులివి. సరే.... ఓ మహా విపత్తు రాబోయి ఆగింది. ఈ ఆగడం అనేది ఎంత కాలమో తెలిసింది కాలానికి మాత్రమే. పునరపి జననం పునరపి మరణంలాగా జీవులు మళ్ళీ మళ్ళీ పుట్టడం, మరణించడం తప్పదు. జరుగుతున్నవన్నీ ఆ లెక్కకు సంబంధించినవే" లేచి నిలబడ్డాడు నాగయ్య.

"అయ్యా... నా బిడ్డని మరోసారి ఆశీర్వదించరూ!" ప్రార్ధించినట్టుగా అడిగింది శరద్వతి.

శ్రీనివాస్ ఆశ్చర్యపోయాడు. శరద్వతి నాగయ్యని అంత గౌరవంతో ప్రార్థించడం ఏమిటీ? అనేది అతని ప్రశ్న.

రుద్రమూర్తి కూడా ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"నీ బిడ్డెప్పుడో ఆశీర్వదింపబడినవాడు. అర్థం అయ్యేలా చెప్పాలంటే కారణ జన్ముడు. అమ్మా పురాణం పంచలక్షణం అంటారు మొదటిది సర్గ లేక సృష్టి. రెండవది ప్రళయం తరవాత జరిగే పునఃసృష్టి. మూడవది వంశవాలు అంటే సూర్య చంద్ర వంశముల విశేషాలు నాల్గవది మధ్యంతరము. అంటే ఏ మనువు తరువాత ఏ మనువు అనే

విషయాలు. అయిదవది అనువంశచరితలు. కలియుగం గానీ ఏ యుగంగానీ ఈ సృష్టి అయ్యాక ఒక్క ప్రళయం మాత్రమే ఉండదు. సముద్రంలో కెరటాల్లాగా ప్రతి యుగంలోనూ అనేకానేక చిన్నచిన్న ప్రళయాలు వస్తాయి. సంపూర్ణ ప్రళయం వచ్చేది చివర్న. అయితే ప్రతి ప్రళయం ముందూ ప్రళయ కారకులు ఎలా పుడతారో, ప్రళయాన్నించి రక్షించే రక్షకులు కూడా పుడతారు. అందుకే యీ సృష్టి ఇన్ని కోట్ల సంవత్సరాలుగా నిలిచి ఉంది" ఓ క్షణం ఆగాడు నాగయ్య. అందరూ శ్రద్ధగా వింటున్నారు.

"దేవుడు మానవ అవతారంలో వచ్చిన పృధ్విని రక్షించడం లేదు. దేవుడు కాక దేవుని అంశతో జన్మించి ప్రళయాలనించి కాపడేవారు వేరు. నీ బిడ్డది దైవాంశ. ఎన్ని ప్రమాదాలు మబ్బుల్లా ముసురుకున్నా గాలికి మేఘాలు ఎగిరిపోయినట్టు ఎగిరిపోతాయి. ఒక్క విషయం. మీ భార్యాభర్తలు ఏనాడూ 'నాగవధ' చెయ్యకూడదు. అంతే. పాములు మీకు ఎదురయినా అవేమీ మిమ్మల్ని ఇబ్బంది పెట్టవు. అమ్మా మీ దంపతులకి నాగదేవత ఆశీస్సులు నిండుగా ఉండుగాక! నాయనా రుద్రా వీరిని ఇక్కడికి పిలిపించి మంచిపనిచేశావు. వీరిని తీసుకెళ్ళి అక్కడున్న నాగ ప్రతిమలని చూపించి శ్రద్ధా భక్తులతో పూజ చేయించు అని బయలుదేరాడు నాగయ్య.

శరద్వతీ, శ్రీనివాసుల హృదయాలు ఆనందంతో నిండిపోయాయి. పుట్టబోయే బిడ్డ దైవాంశ సంభూతుడంటే ఎవరు పొంగిపోరూ!

"థాంక్స్‌రా రుద్రా" లేచి నిలబడి రుద్రమూర్తితో కరచాలనం చేసి అన్నాడు శ్రీనివాసు. శరద్వతి కూడా లేచి "ధన్యవాదాలు అన్నయ్యా" అన్నది చేతులు జోడించి.

చెరువులో కలకలం. ముగ్గురూ అటువైపు చూసే ఓ రెండుబారుల పొడుగున్న తెల్లని నాగుపాము పడగెత్తి యీదుతూ నీటిమీద తేలిపోతుంది. కొంగలు కొంచెం ఎగిరి మళ్ళీ నీళ్ళల్లో వాలాయి. నాగుపాము పడగమీద విష్ణు పాదాలని దర్శించి భక్తిగా నమస్కరించారు ముగ్గురూ.

వారిని ఆశీర్వదిస్తున్నట్లుగా ఓ చల్లని గాలి తరగ కదిలింది. తనతోబాటు పూల సుగంధాన్ని మోసుకొస్తూ తెల్లని మేఘాలు ఆకాశంలో కదిలి భూమ్మీద నీడని పరిచాయి.

ఓం శాంతి శాంతి శాంతిః

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments